# గుండె వెనుక కథ

"చందూ ఇలా అయిపోతున్నాడేంట్రా?"

"నిజమేరా! వాడి మెంటాలిటీకి, ప్రవర్తనకి పొంతన కుదరడం లేదు"

"మొన్నొక సంబంధం వచ్చిందట. అమ్మాయి అందంగా కుందనపు బొమ్మలా వుందని తెలిసింది. కట్నం కూడా లకారం పైనేనట"

"మరి, ఏమైంది?"

"ఏమవుతుంది? వాడికి ఒక లకారమివ్వడమే గొప్ప అని అనుకుంటే... ఆ సంబంధం వద్దన్నాడట."

"ఆశ్చర్యంగా వుందే! ఎందుకని అలా చేసాడు"

"ఎందుకేంటి? ఆ అమ్మాయి తండ్రిలేని పిల్ల అని. ఆ సంబంధం వదులుకున్నాట్ట"

"అమ్మాయికి తండ్రి లేకపోతే ఏంటి? ఇంకెవరు లేరా?"

"లేకేం? అమ్మవుంది. అన్నదమ్ములున్నారు. బోలెడు ఆస్తిపాస్తులున్నాయి"

"మరింకేం! తెలివైన వాడనుకుంటే ఇలా చేస్తున్నాడేంట్రా? బంగారంలాంటి ఆఫర్‌ని మిస్ చేసుకున్నాడు"

"బుద్ధి గడ్డి తిని. అయినా వీడికెవరున్నారని? అమ్మాయికి కేవలం తండ్రి లేడు. మరి వీడికో? తల్లీ, తండ్రీ ఇద్దరూ లేనివాడు. అసలు నా అనేవారే లేని అనాథ కదా! అలాగయితే వీడ్నెవరు చేసుకోకూడదన్నట్టేగా, వాడి నిర్ణయం ప్రకారం"

"నిజమేరోయ్! నువ్వన్నట్టు మరి వీడో అనాథ అమ్మాయిని చేసుకోవాలి"

"అంతగొప్ప ఆలోచన వీడికెక్కడేడ్చింది. ఏదో అదృష్టం తన్నుకొచ్చి గవర్నమెంటు ఉద్యోగస్తుడయ్యాడు. అంతదానికే తెగ ఫోజిస్తున్నాడు"

"ఉద్యోగం వచ్చిందిగా, ఆ మహిమేమో!"

"ఇది కాకుండా మరో అయిదారు సంబంధాలు వచ్చాయి. ఏదీ ఖాయం చేసుకోవడం లేదు"

"ఇలా ఏదో వంకపెడుతూ సంబంధాల్ని వద్దనుకుంటూ పోతే వీడికి పెళ్ళయ్యేదెప్పుడు?"

చందూ అనబడే చంద్రకిరణ్ గురించి అతని ఫ్రెండ్స్ చేసే కామెంట్స్ అవి.

అవన్నీ విన్నప్పుడు, విన్పించినప్పుడు చందూ గుండె బరువెక్కుతుంది. కించిత్ బాధ పడతాడు.

కాసేపయ్యాక వాళ్ళ అమాయకత్వానికి జాలిపడతాడు.

ఏ గుండె వెనకాల ఏ కథ వుందో ఎవరికెరుక ?

***

"కంగ్రాట్స్ చందూ!"

మూకుమ్మడిగా వచ్చిపడ్డ ఫ్రెండ్స్, చందూ చేతులు పట్టుకుని ఊపారు.

వాళ్ళ ముఖాల్లో చిర్నవ్వు.

"థాంక్స్" చెప్పాడు నిండు మనసుతో.

"ఎనీ హౌ! పెళ్లి సెటిలయ్యింది" ప్రత్యేకంగా ఒక మిత్రుడి అభినందన.

బదులుగా నవ్వి "అలా వెళ్లి టీ తాగొద్దాం పదండి" అన్నాడు చందు.

సరేనంటూ ఉడిపిహోటల్‌లో దూరారంతా.

సర్వర్ వచ్చాడు. చందూ అందరికీ టీ ఆర్డర్ చేసాడు.

"మగపిల్లల్లేకుండా ఒక్కతే అమ్మాయటగా!" అడిగాడింకో ఫ్రెండ్.

అవునంటూ చందూ తలూపాడు.

"నీ ఆలోచన బావుందిరా. ఇన్నాళ్లూ వెయిట్ చేసింది ఇందుకన్నమాట"

"నీ పాలసీ మెచ్చుకోదగిందే. నీకా ఆస్థిలేదు. ఇలాగైనా నీ ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది"

"తల్లిదండ్రులకి ఒక్కతే కూతురున్న అమ్మాయిని వివాహం చేసుకోవాలన్న ఆలోచనే మాకు తట్టలేదు సుమా!"

స్నేహితులంతా తలా ఓ మాట విసురుతూ వున్నారు.

వాళ్ళ మాటల్ని ఓపిగ్గా వింటున్నాడతను.

టీలు వచ్చేసాయి. కప్పులు వాళ్ళ చేతుల్లోకి మారాయి.

"లక్కీ ఫెలోవిరా! తదనంతరం ఆ అమ్మాయి ఆస్తిపాస్తులు నీ సొంతమవుతాయి" టీ సిప్ చేస్తూనే మరొక గొంతు పలికింది.

రెండు నిముషాలు అందరి మధ్య నిశ్శబ్దం.

గొంతు సవరించుకున్నాడు చందు.

"ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్! వాళ్ళకెలాంటి ఆస్థిపాస్తులు లేవు. చాలా పేదవాళ్ళు. కనీసం కట్నకానుకలిచ్చే స్తోమత కూడా లేదు" చందూ చెబుతోంటే ఆశ్చర్యపోయారంతా.

"మంచితనం మూర్తీభవించిన మనషులు వాళ్ళు. మర్యాదస్తులు. భర్తకి తగినట్టు నడుచుకునే నడవడిక ఉంది అమ్మాయిలో" అంటూ ఆగాడు.

శ్రోతల్లా మిగిలిపోయారంతా.

తిరిగి తనే చెప్పాడు.

"ఒరేయ్! మీకు తెలుసు నేను అనాథని. తల్లిదండ్రుల అనురాగానికి నోచుకోని వాడ్ని. అన్నదమ్ముల ప్రేమాభిమానాల్ని పంచుకోనివాడ్ని. బంధాలూ అనుబంధాల తీపి జ్ఞాపకాల దొంతరలేవీ గుండె గూడునల్లుకోనివాడ్ని"

మౌనంగా అతను చేప్పేది వింటున్నారంతా.

"ఏరి కోరి ఈ సంబంధాన్ని సెలెక్ట్ చేసుకుంది ఎందుకో తెలుసా?

**అత్తామామల్ని, అమ్మానాన్నలుగా చేసుకొని ఆదరించాలని, వాళ్ళ ఆప్యాయతల్ని చవిచూడాలని, వాళ్ళకి కొడుకుల్లేని లోటు తీర్చాలని, వృద్ధాప్యంలో**

సైతం వాళ్ళ ఆలనా పాలనా చూసుకోవాలని.

అందుకే తల్లిదండ్రులకు అమ్మాయి ఒక్కతే సంతానం ఉన్న సంబంధం ఎన్నుకున్నాను"

వృద్ధాప్యంలో కన్న తల్లిదండ్రుల్ని స్వంత కొడుకులే ఈసడించుకుంటున్న ఈ కాలంలో చందూ ఇంత గొప్ప నిర్ణయం తీసుకోవడం వాళ్ళూహించనిది.

ఇంత ఉన్నతమయిన ఆదర్శాలు ఉన్న వ్యక్తినా! ఇన్నాళ్ళూ తాము అపార్థం చేసుకున్నది? సిగ్గుతో తలలు వంచుకున్నారు స్నేహితులంతా.

(31.1.2002)

*